శిక్షణ తరగతులకు ఎంపిక



ఆమనగల్లు: రాజేంద్రనగర్‌లోని ఎక్స్‌టెన్షన్ ట్రైనింగ్ సెంటర్‌లో రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీ రాజ్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహించే శిక్షణ తరగతులకు కడ్తాల్ సర్పంచ్ జీఎల్ఎన్ రెడ్డి ఎంపికయ్యారు. 'గ్రామ పంచాయతీల సొంత ఆదాయం- వనరుల సమకూర్పు' అంశంపై ఐదు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు.



ఆలయాల్లో మానసిక ప్రశాంతత

ఆలయాల్లో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్ సేల్స్ ట్యాక్స్ రిటైర్డ్ అధికారి నంగం రమేశ్ అన్నారు. 8లో▸



హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. 8లో▸

న్యూస్‌రీల్

తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం



అనిమ సోంకర్‌తో స్థానిక బీజేపీ నాయకులు

తుర్కయంజాల్: తెలంగాణలో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని బీజేపీ జాతీయ ఎస్సీ మోర్చా సోషల్ మీడియా కన్వీనర్ అనిమ సోంకర్ జోస్యం చెప్పారు. తుర్కయంజాల్ పురపాలక సంఘం పరిధి ఇంజాపూర్‌లో నివసించే రాష్ట్ర ఎస్సీ మోర్చా సోషల్ కన్వీనర్ కొండ్రు పురుషోత్తం నివాసానికి ఆదివారం ఆమె మర్యాదపూర్వకంగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెను శాలువాతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో వనపర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి బోసుపల్లి ప్రతాప్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పోరెడ్డి అర్జున్ రెడ్డి, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బచ్చిగళ్ల రమేష్, నాయకులు యెన్ను యాదిరెడ్డి, రాష్ట్ర బీజేవైఎం ప్రొటోకాల్ కన్వీనర్ కార్తీక్ గౌడ్ పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలపై చర్యలు తీసుకోండి

అసెంబ్లీలో ప్రస్తావించిన షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్



షాద్‌నగర్‌రూరల్: రాష్ట్రంలో కల్తీ విత్తనాల బెడదను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ శాసనసభ సమావేశాల్లో ప్రస్తావించారు. ఆదివారం ప్రశ్నోత్తరాల సమయంలో మాట్లాడారు. ఇటీవల నియోజకవర్గంలోని ఓ రైతు కొనుగోలు చేసిన కూరగాయల విత్తనాలు నాణ్యత లేకపోవడంతో నష్టపోయాడని సభ దృష్టికి తెచ్చారు. నాణ్యమైన విత్తనాలను అందించాలంటే ప్రైవేట్‌కు అప్పగించకుండా ప్రభుత్వమే విక్రయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీడ్‌ను పండించేందుకు నియోజకవర్గంలో అనువైన పొలాలు ఉన్నాయన్నారు. స్థానికంగా ఏదైనా ప్రాంతం, గ్రామాన్ని ఎంపిక చేసి విత్తనాలను విక్రయిస్తే రైతులకు అందుబాటులో ఉండటంతో పాటు నష్టాలను నివారించవచ్చని పేర్కొన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్లలో మాంసం, చేపల విక్రయాలను మున్సిపాలిటీ నిర్వహిస్తుందా లేక ప్రభుత్వమే చూసుకుంటుందా అని ప్రశ్నించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి కేసీఆర్ కల్తీ విత్తనాల బెడద లేకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో మార్కెట్లు ప్రజలకు సరిపడా లేవని.. దుమ్ము, ధూళితో ఉండేవన్నారు. ఈ నేపథ్యంలో సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. కనీసం రెండు లక్షల జనాభాకు ఒక మార్కెట్‌ను ఏర్పాటు చేయాలనే ఆలోచన ప్రభుత్వం చేస్తోందని తెలిపారు.

ఫోన్ కొట్టేసి.. నగదు బదిలీ చేసి!

సాక్షి, సిటీ బ్యూరో: మాదాపూర్ ప్రాంతానికి చెందిన ఓ ఐటీ ఉద్యోగి. ఉదయం బస్సులో ఆఫీసుకు వెళ్తుండగా జేబులోని ఫోన్ గుర్తు తెలియని వ్యక్తులెవరో కొట్టేశారు. ఆఫీసుకెళ్లాక చూస్తే ఫోన్ లేదు. కాసేపు కంగారు పడిన అతను స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫోన్ అవసరం కాబట్టి మధ్యాహ్నం వెళ్లి కొత్తది కొని, సిమ్ కార్డు వేశాడు. అంతలోనే బ్యాంకు నుంచి రెండు మెసేజ్‌లు వచ్చాయి. అవి చూసి షాక్ అయ్యాడు. తనకి తెలియకుండా ఎవరో తన ఫోన్‌లోని యూపీఐ అకౌంట్లను వినియోగించారని! ఇలా సైబర్ నేరస్తులు సరికొత్త రకంగా ఖాతాలు లూటీ చేస్తున్నారు. బాధితుల ఫోన్లు కొట్టేసి అందులోని ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం వంటి యూపీఐ వాలెట్ల నుంచి నగదు బదిలీ చేస్తున్నారు.

కోడ్స్ ఛేదిస్తున్నారు..

సాధారణంగా ఫోన్ పోయి కొత్త ఫోన్ కొనే నంబర్ యాక్టివేషన్ చేసేలోపు సైబర్ నేరస్తులు ఖాతా ఖాళీ చేస్తున్నారు. ఎక్కువ మంది బ్యాంకు ఖాతా నంబర్, యూపీఐ పిన్ వంటివి కాంటాక్ట్ లిస్టులో సేవ్ చేసుకుంటారు. ఇదే నేరస్తులకు వరంగా మారింది. మరికొందరు యూపీఐ పిన్ వరుస నంబర్లు, పుట్టిన తేదీ, వాహన రిజిస్ట్రేషన్ నంబర్ వంటి సులువుగా కనుక్కునే నంబర్లు పెట్టుకుంటారు. ఆయా కోడ్స్‌ని సైబర్ నేరస్తులను సులువుగా ఛేదించగలుగుతున్నారు. కొట్టేసిన ఫోన్‌లోని యూపీఐ అకౌంట్లు ఏ బ్యాంకు ఖాతాకు అనుసంధానమై ఉన్నాయో తెలుసుకొని ఖాతా ఖాళీ చేస్తున్నారు.

యూపీఐ ఇలా బ్లాక్ చేయాలి

- గూగుల్ పే: 18004190157
- ఫోన్ పే: 08068727374
- పేటీఎం: 01204456456

'పోడు'పై తర్జనభర్జన

- మూడు మండలాల్లో 842 ఎకరాల అటవీ భూముల ఆక్రమణ
- పోడుభూముల పంపిణీ పథకం కింద 1,086 మంది దరఖాస్తు
- ఎటూ తేల్చుకోలేకపోతున్న రెవెన్యూ అధికారులు
- ఈ నెలాఖరు వరకు పట్టాలివ్వనున్నట్లు సీఎం ప్రకటన
- దరఖాస్తుదారుల్లో ఆందోళన.. పంపిణీపై అన్నీ అనుమానాలే..



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆక్రమణదారుల చెరలో ఉన్న అటవీ (పోడు)భూముల పంపిణీపై పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి జిల్లాలో ఏజెన్సీ ప్రాంతం లేదు. పోడుసాగు కనిపించదు. కొంతమంది రైతులు తమ పట్టా భూముల పక్కనే ఉన్న అటవీ భూములను ఆక్రమించి సాగు చేసుకుంటున్నారు. ఈ భూముల గుర్తింపు, లబ్ధిదారుల ఎంపిక, పంపిణీ రెవెన్యూ అధికారులకు సవాల్‌గా మారింది. ఇదిలా ఉంటే ఈ నెలాఖరులోగా పోడు భూములను అర్హులకు పంపిణీ చేయడంతో పాటు వారికి రైతుబంధు సహా వ్యవసాయ కనెక్షన్లు జారీ చేయనున్నట్లు అసెంబ్లీ సాక్షిగా శుక్రవారం సీఎం కేసీఆర్ ప్రకటించిన విషయం తెలిసిందే. క్షేత్రస్థాయిలో పోడు భూములు లేకపోయినా.. అనేక మంది ఇందుకు దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో గిరిజనుల కంటే గిరిజనేతరులే అధికంగా ఉన్నారు. నిజానికి విలువైన ఈ భూములను వదులుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో జిల్లాలో పోడు భూముల గుర్తింపు, పంపిణీ సాధ్యమా..? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఆక్రమణదారుల్లో గిరిజనేతరులే అధికం

జిల్లాలో 29,282.48 హెక్టార్ల అటవీ భూములు ఉన్నట్లు అంచనా. నగరానికి ఆనుకుని జిల్లా ఉండటం, జాతీయ, అంతర్జాతీయ కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెడుతుండటంతో ఇక్కడి భూముల ధరలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఇదే అదనుగా భావించిన కొంత మంది రైతులు తమ పట్టా భూములకు ఆనుకుని ఉన్న అటవీ భూములను కబ్జా చేసి ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారు. ప్రభుత్వం పోడు భూముల పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడంతో ఎలాగైనా వీటిని దక్కించుకోవాలని భావిస్తున్నారు. అటవీ భూములను పోడు భూముల జాబితాలో చూపించి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మంచాల మండల పరిధిలోని రంగాపూర్, తాళ్లపల్లిగూడ, బోడకొండలో 755.35 ఎకరాలు, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని నాగన్‌పల్లి, పోల్కంపల్లిలో 30.23 ఎకరాలు, అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలో 37.23 ఎకరాల భూమి ఉండగా..మరో 24 ఎకరాల అటవీ భూమిని స్థానిక రైతులు ఆక్రమించి ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారు. పోడు భూముల పంపిణీకి ప్రభుత్వం అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఆయా మండలాల నుంచి 1,086 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 55 మంది ఎస్టీలు ఉండగా, మిగిలిన వారంతా గిరిజనేతరులే. వీరంతా రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై.. రికార్డుల్లో అడ్డగోలుగా పేర్లు నమోదు చేయించారు. క్షేత్రస్థాయిలో ఉన్న భూమి కంటే ఎక్కువగా రికార్డులు వెలుగులోకి వచ్చాయి. ఇప్పటికే ఎకరాల కొద్దీ భూములు అనర్హుల చేతుల్లోకి వెళ్లిపోయాయి.

ఇప్పటికీ పూర్తి కాని లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ

పోడు భూముల పంపిణీకి ప్రభుత్వం పలు నిబంధనలు విధించింది. అర్హుల జాబితాలో పేర్లు నమోదు కావాలంటే ఇవి తప్పనిసరిగా పేర్కొంది. పోడు భూములను సాగు చేసుకుంటున్న వారిలో గిరిజనులై ఉండాలి. అది కూడా వారు 2015 డిసెంబర్ 13 వరకు కబ్జాలో ఉండాలి. ఒకవేళ సాగులో ఉన్నది గిరిజనేతరులైతే వారు 2005 ముందు మూడు తరాలుగా సాగు చేసుకుంటున్న ఆధారాలు సమర్పించాలి. కబ్జాదారులకు మరెక్కడా కూడా సొంతభూములే కాదు వాహనాలు కూడా ఉండకూడదు. తెల్లరేషన్ కార్డును కలిగి ఉండాలి. పూర్తిగా గ్రామ కమిటీల ద్వారా ఎంపిక జరుగుతుంది. అయితే జిల్లాలో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పటికీ పూర్తి కాలేదు. ప్రభుత్వం ఈ భూములను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించినప్పటికీ..ఇప్పటికీ లబ్ధిదారులను ఎంపిక చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మెజార్టీ దరఖాస్తుదారులకు ఇతర ప్రాంతాల్లో భూములు ఉన్నాయి. ట్రాక్టర్, కారు ఇలా ఏదో ఒక వాహనాన్ని కలిగి ఉన్నారు. ఇలాంటి వారికి పోడు జాబితాలో అర్హత దక్కుతుందా అనేది వేచి చూడాలి.



బాలయేసు పుణ్యక్షేత్రం వద్ద భక్తుల సందడి

భక్తిభావం నిండగ.. 'ఊరి పండుగ'


ఘనంగా బాలయేసు వార్షిక మహోత్సవం

తుర్కయంజాల్: పురపాలక సంఘం పరిధి కమ్మగూడలోని అద్భుత బాలయేసు వార్షిక మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన ఊరి పండుగకు భక్తులు వేల సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తెల్లవారు జామున 4 గంటల నుంచే దివ్య బలిపూజ కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. నగరంలోని బోయిగూడ నుంచి బాలయేసును ఊరేగింపుగా తీసుకువచ్చారు. స్థానికులు ఊరేగింపునకు స్వాగతం పలికారు. బాలయేసు మహోత్సవ దివ్య బలిపూజను ఇంగ్లిష్‌లో ఫాదర్ అల్లం ఆరోగ్య రెడ్డి, తెలుగులో కార్డినల్, హైదరాబాద్ అతి మేత్రాణులు పూల ఆంథోని తెలుగులో వినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు బోధనలు అందరికీ ఆదర్శం అని కొనియాడారు. నగరంతో పాటు రాష్ట్రంలోని నలుమూలల నుంచి భక్తులు వేల సంఖ్యలో హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి హాజరయ్యారు. స్థానిక కౌన్సిలర్ కాకుమాను సునీల్, కో ఆప్షన్ సభ్యురాలు కాకుమాను మరియమ్మ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను పర్యవేక్షించారు. వనస్థలిపురం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఫ్యాన్.. ఏసీ ఆన్

పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఉక్కపోత

- గ్రేటర్‌లో భారీగా విద్యుత్ వినియోగం
- హీటెక్కుతున్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు
- ఒత్తిడికి గురవుతున్న డీటీఆర్‌లు
- దారుషిఫాలోని డీటీఆర్‌లో మంటలు



సాక్షి, సిటీబ్యూరో: భానుడి ప్రతాపం అప్పుడే మొదలైంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు విద్యుత్ శాఖకు ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. సాధారణంగా శివరాత్రి తర్వాత ఎండల తాకిడి పెరుగుతుంది. ఈసారి మాత్రం ముందుగానే ఎండలు మండుతుండటంతో గ్రేటర్‌లో విద్యుత్ డిమాండ్ పెరిగింది. ఉదయం 10 గంటల తర్వాత సూర్యుడు సుర్రుమంటున్నాడు. మధ్యాహ్నం పూట బయటికి రావాలంటేనే నగరవాసులు కాస్త ఆలోచిస్తున్నారు. శనివారం గరిష్ఠంగా 35.4 సెల్సియస్, కనిష్ఠంగా 16.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. భగ్గున మండుతున్న ఎండలకు ఉక్కపోత తోడవడంతో ఉపశమనం కోసం సిటీజన్లు ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు.

57 ఎంయూలకుపైగా..

- వాతావరణంలో ఒక్కసారిగా చోటు చేసుకున్న ఈ మార్పులను శరీరం తట్టుకోలేకపోతోంది. నిజానికి చలి కారణంగా నిన్న మొన్నటి వరకు ఫ్యాన్లు పెద్దగా వాడలేదు. ప్రస్తుతం ఉక్కపోత ప్రారంభం కావడంతో ఏకంగా ఏసీలను ఆన్ చేస్తున్నారు. కేవలం గృహ విద్యుత్ మాత్రమే కాకుండా వాణిజ్య వినియోగం భారీగా నమోదవుతోంది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు పూర్తి స్థాయిలో పని చేస్తుండటమే ఇందుకు కారణం.
- ఫిబ్రవరి మొదటి వారంలో నగరంలో రోజు సగటు విద్యుత్ డిమాండ్ 52 మిలియన్ యూనిట్లు ఉండగా, ప్రస్తుతం 57 మిలియన్ యూనిట్లకు చేరుకుంది. రెండో శనివారం విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు. వర్కింగ్ డేస్‌తో పోలిస్తే.. సెలవు దినాల్లో వినియోగం కొంత తగ్గాల్సి ఉంది. కానీ ఇందుకు విరుద్ధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు కావడం విశేషం. మార్చి చివరి నాటికి 75 నుంచి 80 ఎంయూలకు చేరుకునే అవకాశం ఉన్నట్లు డిస్కం అంచనా వేసింది.

హీటెక్కుతున్న డీటీఆర్‌లు

ఒక్కసారిగా విద్యుత్ వినియోగం పెరగడంతో సబ్‌స్టేషన్లలోని ఫీడర్లు ఒత్తిడికి గురవుతున్నాయి. ఆయిల్ లీకేజీలను సరి చేయకపోవడంతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్లు ఒత్తిడి తట్టుకోలేక పేలిపోతున్నాయి. తాజాగా శనివారం పాతబస్తీ దారుషిఫాలోని ఓ డీటీఆర్ నుంచి మంటలు వ్యాపించి భారీ శబ్దంతో పేలిపోవడంతో స్థానికులు భయాందోళనలతో పరుగులు తీశారు. వేసవి ప్రారంభానికి ముందే లైన్ల పునరుద్ధరణ, లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, డీటీఆర్‌లలో ఆయిల్ లీకేజీల నియంత్రణ, ఎర్తింగ్ ఏర్పాటు, లూజు లైన్లను సరి చేయడం వంటి పనులు పూర్తి చేయాల్సి ఉన్నా.. అధికారులు ఇప్పటి వరకు వాటిపై దృష్టిపెట్టకపోవడం ఆందోళన కలిగిస్తోంది.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

- రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఖాయం
- పార్టీ బలోపేతానికి కృషి చేయండి
- ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బొక్కా నర్సింహారెడ్డి

శంకర్‌పల్లి: వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్కా నర్సింహారెడ్డి అన్నారు. మండలంలోని మోకిలలో ఆదివారం ప్రజాగోస- బీజేపీ భరోసా (కార్నర్ మీటింగ్) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో మోదీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం ఎన్నో పథకాలు చేపట్టిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు. దళితులకు మూడెకరాలు ఇస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ నెరవేర్చకపోగా రాష్ట్రంలోని దళితుల అసైన్డ్ భూములను దౌర్జన్యంగా లాక్కుంటోందని ఆరోపించారు. ఇటీవల మోకిలలో ఇలాగే లాక్కొని హెచ్ఎండీఏకు అప్పగించిందన్నారు. ప్రతి నియోజకవర్గంలో 100 పడకల ఆస్పత్రి మాట ఏమైందని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీఎం కేసీఆర్ నిరంకుశ పాలనకు రోజులు దగ్గరపడ్డాయని, బీజేపీతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు. గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి, రైల్వే బోర్డు సభ్యురాలు ఉమారాణి, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు రాములుగౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బీర్ల సేరేష్, చేవెళ్ల నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు ప్రకాష్, శక్తి కేంద్రం ఇన్‌చార్జి హరినాథ్, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, జంగారెడ్డి, రామకృష్ణ, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్మీడియెట్ ప్రాక్టికల్స్

- రోజూ రెండు విడతల్లో పరీక్షలు
- ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఇంటర్మీడియెట్ సెకండియర్ ప్రాక్టికల్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. ఈ నెల 15 నుంచి మార్చి 2 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రోజూ రెండు విడతల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక బ్యాచ్, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మరో బ్యాచ్‌కి పరీక్షలు నిర్వహిస్తారు. విద్యార్థులు కాలేజీ యాజమాన్యాల నుంచి హాల్‌టికెట్లు తీసుకుని వారికి కేటాయించిన పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలని జిల్లా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారి వెంక్యా సూచించారు. హాల్‌టికెట్లకు ఫీజులను ముడిపెట్టి విద్యార్థులను ఇబ్బంది పెట్టే యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో మొత్తం 55 వేల మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. మార్చి 15 నుంచి వార్షిక పరీక్షలు మొదలు కానున్నాయని, ఇప్పటికే పాఠ్యాంశాలన్నీ పూర్తి చేసుకుని పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తల్లిదండ్రులు విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. పరీక్షల సీజన్‌లో సాధ్యమైనంత వరకు ఇంట్లో టీవీలు ఆఫ్ చేసి ఉంచి, చదువుకునేందుకు ప్రశాంతమైన వాతావరణం కల్పించాలన్నారు.

భగవంతుడే జీవన సూత్రం

వైఎస్ఎస్ అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి చిదానందగిరి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామి చిదానంద గిరి

నందిగామ: మన దేశంలో భగవంతుడే జాతి జీవన సూత్రమని, ప్రపంచ నాగరికతకు ఈ జీవన విధానమే ఆధారమని యోగ సత్సంగ సొసైటీ (వైఎస్ఎస్) సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ అంతర్జాతీయ అధ్యక్షుడు స్వామి చిదానందగిరి అన్నారు. మండల పరిధిలోని కాన్హా శాంతి వనంలో ఆదివారం నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్వర్ణమయమైన సనాతన భారతీయ ఆధ్యాత్మిక నాగరికతకు, భవిష్యత్తులో రాబోయే ఏక ప్రపంచ ఆధ్యాత్మిక నాగరికతకు మధ్య వారధులుగా తయారు కావాలని పిలుపునిచ్చారు. యోగ సత్సంగ సొసైటీ వ్యవస్థాపకుడు పరమహంస యోగానంద ధ్యానం, సంఘం, గురు కృపతో కూడిన సాధన మార్గాలను ప్రసాదించారని చెప్పారు. నిత్యం క్రమం తప్పకుండా చేసే శాస్త్రీయ క్రియా యోగ సాధనతో శాశ్వత పరమాత్మ తత్వంలో శరణు పొందాలని సూచించారు. పరమహంస చెప్పినట్లుగా ప్రపంచం ముక్కలవుతున్నా చెక్కు చెదరకుండా ఆత్మాలయంలో స్థిరంగా నిలబడాల్సిన అవసరం ఉందన్నారు. కనుబొమ్మల మధ్య బిందువుపై దృష్టిని ఏకాగ్రం చేస్తే అంతరంగంలో నుంచి ఆధ్యాత్మిక శక్తి ప్రవహిస్తుందని స్వామి చిదానందగిరి పేర్కొన్నారు. ఈ నెల 16 వరకు ఈ కార్యక్రమాలు కొనసాగించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెల్ఫ్ రియలైజేషన్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు స్వామి విశ్వానంద గిరి, యోగ సత్సంగ సొసైటీ ఉపాధ్యక్షుడు స్వామి స్మరణానంద గిరి, ప్రధాన కార్యదర్శి స్వామి ఈశ్వరానందగిరి తదితరులు పాల్గొన్నారు.

బాటిళ్ల శుద్ధి పరిశ్రమలో పేలుడు

- ఎనిమిది మందికి గాయాలు
- ఇద్దరి పరిస్థితి విషమం
- గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో ఘటన



పేలుడు జరిగిన పరిశ్రమ

శంషాబాద్: గగన్‌పహాడ్ పారిశ్రామికవాడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న బాటిళ్ల శుద్ధి పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మరో ఎనిమిది మంది కాలిన గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆర్‌జీఐఏ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో సొహైల్ అనే వ్యక్తి ఓకే ఆర్ బ్రిడ్జి సమీపంలో ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ వివిధ రకాల బాటిళ్లను శుద్ధి చేసే పరిశ్రమను నడిపిస్తున్నాడు. ఇందులో కాలం చెల్లిన ఔషధాలు, కాస్మోటిక్స్, ఇతర రసాయన వ్యర్థాలకు సంబంధించిన బాటిళ్ల నుంచి వ్యర్థాలను తీసి శుద్ధి చేస్తుంటారు.

అర్ధరాత్రి సమయంలో ..

శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో రసాయన వ్యర్థాలను శుద్ధి చేసే ప్రక్రియలో ఒక్కసారిగా పేలుడు సంభవించింది. పరిశ్రమలో పెద్ద ఎత్తున మంటలంటుకున్నాయి. స్థానికుల సమాచారం మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇందులో సద్దాం, సాహిల్, రాయల్, అఫ్తాబ్, ఇస్లాంమతీనుల్లా, కమిల్, మామా, ప్రతాప్‌సింగ్, అర్మాన్, హసన్ అనే కార్మికులు పని చేస్తున్నారు. మంటల్లో చిక్కుకున్న వారిని పోలీసులు ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎనిమిది కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నారు. కార్మికులంతా ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు.

ప్రమాదకర పరిశ్రమ..

ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో వ్యర్థాల శుద్ధి సమయంలో ప్రతిరోజు పేలుళ్ల శబ్దాలు వస్తుంటాయని స్థానికులు చెబుతున్నారు. నిబంధనల ప్రకారం కార్మికులకు ఎలాంటి భద్రతా ఏర్పాట్లు చేయలేదని అధికారులు గుర్తించారు. రసాయన, ఔషధ, కాస్మోటిక్స్ కంపెనీల వద్ద కాలంటి చెల్లిన వాటిని లారీల్లో పెద్ద ఎత్తున తీసుకొచ్చి శుద్ధి చేస్తున్న క్రమంలో బయటికి వచ్చే వ్యర్థాలను కూడా పర్యావరణ హితంగా చేపట్టడం లేదని గుర్తించారు. అక్రమంగా నడిపిస్తున్న పరిశ్రమ యజమాని సొహేల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాస్ తెలిపారు.

గొర్రెల మందపై హైనా దాడి

- 32 జీవాలు మృతి
- బాధితుడికి నేతల పరామర్శ

కడ్తాల్: గొర్రెల మందపై హైనా దాడి చేయడంతో 32 గొర్రెలు మృత్యువాత పడగా మరో తొమ్మిది తీవ్రంగా గాయపడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని ముక్త మాదారం గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధిత రైతు కట్ల శ్రీశైలం తెలిపిన ప్రకారం.. తెల్లవారుజామున మందపై హైనా దాడిచేయడంతో గొర్రెలు మృత్యువాతపడి సుమారు రూ.4లక్షల నష్టం వాటిల్లిందని వాపోయాడు. సమాచారం అందుకున్న అటవీశాఖ అధికారి విజయభాస్కర్ రెడ్డి ఘటనా స్థలిని పరిశీలించి వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాట నర్సింహ, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్ బాధితుడిని పరామర్శించి, రూ.6వేలు ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు దశరథ్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, ఎంపీటీసీ సభ్యుడు గోపాల్ తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత రైతుకు రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ప్రభుత్వపరంగా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న జెడ్పీటీసీ

హామీలు విస్మరించిన ప్రభుత్వాలు

- ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి
- మైసిగండిలో 'హాథ్ సే హాథ్ జోడో' యాత్ర ప్రారంభం


హాథ్ సే హాథ్ జోడో యాత్రలో వంశీచంద్‌రెడ్డి

కడ్తాల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించాయని ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి విమర్శించారు. ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్‌జోడో యాత్ర సందేశం ప్రతీ గడపకు చేర్చాలనే ఉద్దేశంతో హాథ్ సే హాథ్ జోడో యాత్రను ఆదివారం మైసిగండి నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ గ్రామ సమస్యలు తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్నాయని కరపత్రాలు పంపిణీ చేశారు. దేశం ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం పెరిగిందని, రైతులు అప్పుల్లో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ సంపద కొంతమంది పారిశ్రామికవేత్తల చేతుల్లోనే ఉందని విమర్శించారు. పెట్రోల్, డీజిల్ ధరలతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని వాటి ఊసే ఎత్తడం లేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కేజీ టూ పీజీ ఉచిత విద్య, డబుల్ బెడ్రూం ఇళ్లు, నిరుద్యోగ భృతి, రుణమాఫీ, దళితులకు మూడెకరాల భూమి తదితర హామీలన్నీ తుంగలో తొక్కిందన్నారు. వచ్చే ఎన్నికల్లో కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఈ యాత్రలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బీక్యానాయక్, కడ్తాల్, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు నర్సింహ, మహేశ్, రాములు, నాయకులు విజయ్‌కుమార్‌రెడ్డి, సేవ్యానాయక్, అనిల్, బీచ్యానాయక్, అజీం, చేగూరి వెంకటేశ్, సర్పంచ్ శంకర్, లక్ష్మయ్య, మల్లయ్య, జవహర్‌లాల్, హీరాసింగ్ తదితరులున్నారు.

ఆలయాల్లో మానసిక ప్రశాంతత

హైదరాబాద్ సేల్స్ ట్యాక్స్ రిటైర్డ్ అధికారి రమేశ్


దాతలను సన్మానిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్‌రూరల్: ఆలయాల్లో మానసిక ప్రశాంతత చేకూరుతుందని హైదరాబాద్ సేల్స్ ట్యాక్స్ రిటైర్డ్ అధికారి సంగం రమేశ్ అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి పంచాయతీ పరిధిలోని జీవన్‌గూడలో ఎల్లమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ఆలయాలను నిర్మించుకుని.. ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చిన అజీనగర్ గ్రామస్తుడు చన్‌వెల్లి నరేందర్‌రెడ్డి, ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని అందజేసిన సంగం రమేశ్‌ను ఘనంగా సన్మానించారు. సోమవారం అమ్మవారి ప్రతిష్ఠాపన పూజలు, మంగళవారం అమ్మవారికి బోనాలు, నైవేద్యాలను సమర్పనతో ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

ఎఫ్ఎంజీఈలో సత్తా చాటిన ఆలియా సుల్తానా



మంచాల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన పేదింటి విద్యార్థిని ఫారెన్ మెడికల్ గ్రాడ్యుయేట్ ఎగ్జామినేషన్(ఎఫ్ఎంజీఈ) పరీక్షల్లో సత్తా చాటింది. మండల పరిధిలోని ఆరుట్ల గ్రామానికి చెందిన మహ్మద్ సలాం, నిలోఫర్ దంపతుల సంతానం ఆలియా సుల్తానా. గ్రామంలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం పాఠశాలలో 5వ తరగతి వరకు చదివింది. ఇబ్రహీంపట్నంలో ప్రభుత్వ తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాలలో ఉన్నత విద్యను అభ్యసించింది. పదోతరగతి పూర్తైన వెంటనే ఆరుట్లలో మోడల్ స్కూల్ బైపీసీలో ఇంటర్మీడియట్ చదివి కళాశాల టాపర్‌గా నిలిచింది. తన తాత బుర్రాన్‌ఖాన్ ఈ ప్రాంతంలో ఆర్ఎంపీగా సేవలు అందించాడు. ఆమె తండ్రి సలాం, బాబాయిలు ఆర్ఎంపీ వైద్యులుగా పని చేస్తున్నారు. దీంతో తాను డాక్టర్ కావాలనే ఆశయంతో 2017లో చైనాలో వైద్యవిద్యలో చేరింది. 2020 జనవరిలో కోవిడ్ విజృంభిస్తున్న సమయంలో భారతదేశం వచ్చి ఇక్కడే ఉంటూ ఆన్‌లైన్ పాఠాలు వింటూ ఎఫ్ఎంజీఈ పరీక్షకు హాజరైంది. 300మార్కులకు గాను 188మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. దీంతో ఆమెను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అభినందించారు. గ్రామీణప్రాంత ప్రజలకు వైద్య సేవలందించడమే తన లక్ష్యమని సుల్తానా చెప్పింది.

కుక్కల దాడిలో చిన్నారికి గాయాలు


గాయపడిన బాలిక

శంకర్‌పల్లి: వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మోకిల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన నాలుగేళ్ల బాలిక ఉదయం 9గంటల సమయంలో ఇంట్లో నుంచి ఆడుకుంటూ బయటకు వచ్చింది. అక్కడే ఉన్న పది కుక్కలు ఒక్కసారిగా బాలికపై దాడి చేయడంతో తల, వీపు, చేతులు, చెవి భాగాల్లో తీవ్ర గాయాలయ్యాయి. బాలిక కేకలు విన్న కుటుంబ సభ్యులు కుక్కలను తరిమి కొట్టారు. ఆమెను చికిత్స నిమిత్తం శంకర్‌పల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి వీధి కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడి మృతి

శంషాబాద్ : రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. గోషామహల్ కిషన్‌గంజ్ ప్రాంతానికి చెందిన వికాస్ బండారి అతని కుమారుడు నీల్‌బండారి (17) స్కూటీపై శంషాబాద్‌లోని కోష్ ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 9 రాత్రి విందుకు హాజరయ్యారు. రాత్రి ఇంటికి వెళుతుండగా కోష్ ఫంక్షన్‌హాల్ ఎదుట బైక్ అదుపుతప్పి నీల్‌బండారి కిందపడిపోవడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయ భూముల్లో అక్రమ తవ్వకాలు


మట్టి తరలించడంతో ఏర్పడిన గుంతలు

శంషాబాద్ రూరల్: ఆలయ భూమిలో అక్రమంగా మట్టి తరలిస్తున్నారు. భారీ యంత్రాలతో మట్టిని తవ్వడంతో భూమిలో గుంతలు ఏర్పడుతున్నాయి.. మండలంలోని పాల్మాకుల రెవెన్యూలోని సర్వే నంబరు 568లో 1.14 ఎకరాల భూమి.. చేవెళ్లలోని శ్రీ బాలాజీ వెంకటేశ్వర ఆలయం పేరుతో ఉంది. ఈ ఆలయానికి దాతలు ఇచ్చిన ఈ భూమిని స్థానికులు కౌలుకు తీసుకున్నారు. ఏటా రూ.6 వేలు కౌలు చెల్లిస్తూ వ్యవసాయం చేస్తున్నారు. అయితే కొన్ని రోజులుగా కౌలుకు తీసుకున్న వ్యక్తులు ఈ భూమిలో నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. పక్కనే ఉన్న తమ పొలంలోకి ఈ మట్టిని తీసుకెళుతున్నారు. మట్టి తవ్వకాలతో ఆలయ భూముల్లో భారీ గుంతలు ఏర్పడుతుండడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాగుకు యోగ్యమైన ఆలయ భూములను అక్రమార్కులు పనికి రాకుండా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

నిబంధనలు తూచ్

- అనుమతులు లేకుండా పరిశ్రమల నిర్వహణ
- తరచూ ప్రమాదాలు
- నేతలు, అధికారులకు కాసులు కురిపిస్తున్న కంపెనీలు


ప్రేమావతి పేట చెరువు వద్ద నూనె వ్యర్థాల నుంచి రసాయనాలు తయారు చేస్తున్న పరిశ్రమ

శంషాబాద్: ఇక్కడ నిబంధనలు ఏమాత్రం పాటించరు. అంతకుమించి కనీసం సంబంధిత శాఖల నుంచి అనుమతులు సైతం తీసుకోరు. ఇష్టారాజ్యంగా కొనసాగుతోన్న పరిశ్రమలు కొన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో పాటు పెత్తనం చెలాయిస్తున్న కొందరు నేతలు, ప్రజాప్రతినిధులకు కాసులు కురిపిస్తున్నాయి. ఫలితంగా పర్యావరణ హాని పాటు ప్రాణాలు సైతం గాల్లో కలుస్తున్నాయి..

లెక్కకు మించి పరిశ్రమలు

గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతోన్న పరిశ్రమల్లో ఇప్పటికే అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గతంలో ప్లాస్టిక్ రీసైక్లింగ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా అనేక మంది కార్మికులు గాయాలపాలయ్యారు. నూనె పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ప్లై వుడ్ పరిశ్రమలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. గత పదేళ్లలో సుమారు యాభైకి పైగా ప్రమాదాల్లో పదుల సంఖ్యలో మృతి చెందిన కార్మికులతో పాటు అనేక మంది గాయాలపాలయ్యారు. ఇందులో అత్యధికం నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పరిశ్రమల్లో జరిగినవే కావడం గమనార్హం.

ప్లాస్టిక్, రసాయ వ్యర్థాలు..

గగన్‌పహాడ్‌లో ప్లాస్టిక్‌కు సంబంధించిన వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే పరిశ్రమలతో పాటు రసాయన వ్యర్థాలు శుద్ధితో పాటు జంతు వ్యర్థాలతో తయారు చేసే నూనెలు, నూనెల వ్యర్థాలతో తయారు చేసే రసాయనాలకు సంబంధించిన పరిశ్రమలు అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. ప్రేమావతి పేట చెరువు సమీపంలో ఓ వ్యక్తి భారీగా నూనె వ్యర్థాలతో రసాయనాలను తయారుచేసి లారీల్లో సరఫరా చేయడంతో పాటు వ్యర్థాలన్నింటినీ చెరువులోనే కలిపివేస్తున్నాడు. దీనిపై అనేక ఫిర్యాదులొచ్చినా అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. నిబంధనలకు విరుద్ధంగా జంతు సంబంధిత నూనె తయారీ పరిశ్రమ కొనసాగుతున్న అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న సంబంధిత పరిశ్రమల నుంచి ఆయా శాఖలకు చెందిన కొందరు అధికారులతో పాటు కొందరు పోలీసులు, స్థానిక నేతలు, ప్రజాప్రతినిధులకు కూడా భారీగానే ముడుపులు అందుతుండడంతో చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగే సమయంలో హడావిడి చేస్తున్న ఆయా శాఖల అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న పరిశ్రమలపై కఠినవైఖరిని అవలంబించి పర్యావరణంతో పాటు ప్రాణాలను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


పేలుడు జరిగిన ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ కంపెనీ

ప్రతి రోజు పేలుళ్లు



ఎస్ఎస్ ఎంటర్‌ప్రైజెస్ పరిశ్రమలో ప్రతిరోజు బాటిళ్లు పేలి వాటి ముక్కలు బయటపడుతుంటాయి. పలు మార్లు వాహనాలపై పడ్డ సంఘటనలున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

– ఎండీ రెహ్మాన్– గగన్‌పహాడ్